తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-27-జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 239 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# సైనిక శక్తి-వందేమాతరం స్ఫూర్తి

## 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా

- ఆపరేషన్ సిందూర్ శకటం ఆకర్షణ
- దేశీయంగా తయారైన అత్యాధునిక ఆయుధాల ప్రదర్శన
- 150 ఏళ్ల వందేమాతరం థీమ్‌కు ప్రత్యేక గౌరవం
- కర్తవ్యపథ్‌లో 77వ గణతంత్ర వేడుకల వైభవం
- యూరోపియన్ యూనియన్ నేతలు ముఖ్య అతిథులుగా హాజరు
- సీఆర్పీఎఫ్ పరేడ్‌లో నారీ శక్తి చరిత్ర సృష్టి
- యూరోపియన్ యూనియన్ సైనిక దళాల తొలిసారి పాల్గొనడం
- ప్రధాని మోదీ ప్రత్యేక తలపాగా ప్రత్యేక ఆకర్షణ
- ఎన్‌క్లోజర్లకు నదులు–సంగీత వాయిద్యాల పేర్లు
- దేశభక్తి గీతాలతో మార్మోగిన కవాతు వేడుకలు









**ములుగు, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):**
ఆపరేషన్ సిందూర్ శకటం, ఆ పోరాటంలో పాక్ పీచమణచిన అత్యాధునిక ఆయుధ వ్యవస్థలు, అతి శక్తిమంతమైన క్షిపణులు, కొత్త తరం యుద్ధ విమానాలు, సరికొత్త సైనిక విభాగాలు... ఇలా అమేయమైన భారత సైనిక శక్తిని 77వ గణతంత్ర దిన వేడుకలు కళ్లకు కట్టాయి. సిందూర్ థీమ్‌తో రూపొందిన భారత సైన్య శకటం అందరినీ ఆకట్టుకుంది. ఇక దేశీయంగా రూపొందించిన పలు ప్రళయ భీకర ఆయుధాలు ఆహూతులను ఆద్యంతం అలరించాయి. ముఖ్యంగా 150 ఏళ్ల వందేమాతరం థీమ్ ఉర్రూతలూగించింది. సోమవారం ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో గణతంత్ర వేడుకలు ఇందుకు వేదికగా నిలిచాయి. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యూరోపియన్ కమిషన్ చీఫ్ ఉర్సులా వాండెర్ లెయన్ ఈసారి గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

మిగతా 8లో



## చైనా మాంజాతో మరో ప్రాణహాని

- కూకట్‌పల్లిలో ఐదేళ్ల బాలిక దుర్మరణం
- ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ఘటన
- నిషేధం ఉన్నా రహస్య విక్రయాలు కొనసాగుతున్నాయా?
- చైనా మాంజా ప్రాణాంతకమని హెచ్చరికలు

హైదరాబాద్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు): చైనా మాంజా కారణంగా మరో విషాద ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నగరంలోని *కూకట్‌పల్లి*లో ఐదేళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయింది. మేడ్చల్ జిల్లా ఖాజీపల్లి నుంచి తండ్రితో పాటు ఇద్దరు కుమార్తెలు ద్విచక్ర వాహనంపై కూకట్‌పల్లికి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

7లో



## మాధవ్ నగర్ ఆర్‌ఓబీకి పరిపాలన అనుమతులపై సానుకూల స్పందన

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో ఎంపీ అరవింద్ భేటీ
- పెండింగ్‌లో ఉన్న పనిపై విజ్ఞప్తి
- అదనపు నిధుల మంజూరుకు సూచనలు
- సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సమావేశమయ్యారు. నియోజకవర్గానికి సంబంధించిన ఒక అభివృద్ధి పనిపై విజ్ఞప్తి చేసేందుకు తాను మంత్రిని కలిశానని,

2లో

## మేడారం జాతరకు వచ్చే భక్తులకు మంత్రి సీతక్క స్వాగతం

- భక్తులందరికీ హృదయపూర్వక ఆహ్వానం
- క్రమశిక్షణతో దర్శనం చేసుకోవాలి
- క్యూ విధానం తప్పనిసరి
- భద్రతే ప్రభుత్వ ప్రథమ లక్ష్యం

**ములుగు, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):**
బుధవారం నుంచి ప్రారంభం కానున్న మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు తరలివచ్చే భక్తులకు రాష్ట్ర మంత్రి సీతక్క ఘన స్వాగతం పలికారు. ములుగు కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం దివ్యాంగులకు సహాయ పరికరాలు అందజేశారు.

మిగతా 2లో



## కాంగ్రెస్ మోసాలకు మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి: కేటీఆర్

### కాంగ్రెస్ మోసాలకు మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి: కేటీఆర్



**చేవెళ్ల, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఎంపీపీ విజయ్ భాస్కర్ రెడ్డి తన అనుచరులతో కలిసి భారత రాష్ట్ర సమితిలో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కండువా కప్పి వారికి పార్టీలోకి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్ మేతుకుపల్లి, పీ.ఎన్. రెడ్డి పాల్గొన్నారు.
మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మేనిఫెస్టోను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుంగలో తొక్కుతున్నారని తీవ్ర విమర్శలు చేశారు. అనేక అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పక్కన పెట్టి పరిపాలనను విస్మరించిందన్నారు. అధికారంలోకి రాగానే మోసం చేస్తారని తాము ముందే చెప్పామని, రెండు సంవత్సరాల్లో ఏ ఒక్క వర్గాన్ని కూడా వదిలిపెట్టకుండా కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు.

మిగతా 2లో



## కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి: కోదండరాం

- అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామన్న ప్రకటన
- మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమన్న స్పష్టం
- కాంగ్రెస్‌తో పొత్తుపై ఇంకా నిర్ణయం లేదని వివరణ
- సింగరేణి పరిరక్షణకు ఉద్యమ స్ఫూర్తి అవసరం

హైదరాబాద్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి నెలకొన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

2లో

## బీసీ విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం: హరీష్ రావు

- బ్లాంకెట్లు పంపిణీ చేసిన మాజీ మంత్రి
- బీసీ గురుకులాల విస్తరణపై వివరణ
- విద్యార్థులకు చదువుపై ప్రోత్సాహం
- మెడికల్, ఐఐఐటీ సీట్లకు ఆర్థిక భరోసా



**సిద్దిపేట, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):**
సిద్దిపేట రూరల్ మండలం చింతమడకలోని బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు బ్లాంకెట్ల పంపిణీ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన ఆయన, చదువే ఆయుధంగా జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు.
ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాకే బీసీ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు సాధ్యమయ్యాయని తెలిపారు. కేసీఆర్ సీఎం కాకముందు రాష్ట్రంలో కేవలం 16 బీసీ గురుకులాలు మాత్రమే ఉండేవని, ఆయన నాయకత్వంలో వాటిని 350కు పెంచి బీసీ విద్యార్థులకు విద్యలో సమాన అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు.
విద్యార్థులు బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు తాను సొంతంగా ఐప్యాడ్ కొనిస్తానని ప్రకటించారు. అలాగే జహీరాబాద్ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో చదివిన 11 మంది విద్యార్థులు మెడిసిన్ సీట్లు సాధించడాన్ని ఉదాహరణగా పేర్కొంటూ, గురుకులాల ఫలితాలు ఇవేనని అన్నారు.
బైపీసీ విద్యార్థులు కష్టపడి చదివి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు సాధిస్తే వారి ఫీజులు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. "సీటు మీది... ఫీజు నాది" అంటూ విద్యార్థులను మరింత ఉత్సాహపరిచారు. వచ్చే ఏడాదిలో సిద్దిపేట మెడికల్ కాలేజీలో సీట్ల సంఖ్యను 280కి పెంచుతామని కూడా వెల్లడించారు.
బీసీ విద్యార్థుల విద్య, భవిష్యత్తు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం, నాయకత్వం ఎప్పుడూ కట్టుబడి ఉందని హరీష్ రావు స్పష్టం చేశారు. చదువుతోనే సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధ్యమని పేర్కొంటూ, విద్యార్థులు లక్ష్యాన్ని నిర్ధారించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## మోదీ నాయకత్వంలోనే రైల్వే సమస్యలకు శాశ్వత పరిష్కారం

- పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై స్పష్టత
- ఆర్‌యుబి, ఆర్‌ఓబిలకు కేంద్ర హామీ
- రెండేళ్లలో పనులు పూర్తి చేయిస్తాం
- ప్రజాసేవే లక్ష్యం, ప్రచారం కాదు
- ఎంపీ ఈటెల రాజేందర్



**మల్కాజిగిరి, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని ఈస్ట్ ఆనంద్ భాగ్ రాణి రుద్రమదేవి పార్క్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ ఈటెల రాజేందర్ రైల్వే ప్రాజెక్టులపై కీలక వ్యాఖ్యలు చేశారు. పదుల సంవత్సరాలు గడిచినా రైల్వే ప్రాజెక్టులు ముందుకు సాగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అయితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని తెలిపారు. గతంలో కేంద్రం-రాష్ట్రం కలిసి నిధులు సమకూర్చి రైల్వే ప్రాజెక్టులు చేపట్టేవని, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వకపోవడంతో అనేక పనులు పెండింగ్‌లోనే మిగిలిపోయాయని అన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వందశాతం నిధులు కేంద్రం నుంచే విడుదల చేసి రైల్వే ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తోందని స్పష్టం చేశారు.

మిగతా 8లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మాధవ్ నగర్ ఆర్ఓబీకి పరిపాలన అనుమతులపై సానుకూల స్పందన

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో ఎంపీ అరవింద్ భేటీ
- పెండింగ్‌లో ఉన్న పనిపై విజ్ఞప్తి
- అదనపు నిధుల మంజూరుకు సూచనలు
- సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు

**హైదరాబాద్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ సమావేశమయ్యారు. నియోజకవర్గానికి సంబంధించిన ఒక అభివృద్ధి పనిపై విజ్ఞప్తి చేసేందుకు తాను మంత్రిని కలిశానని,
దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని ఎంపీ అరవింద్ తెలిపారు. మంత్రిని కలిసిన విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ కృతజ్ఞతలు తెలియజేశారు. గత పదిహేను నెలలుగా పెండింగ్‌లో ఉన్న మాధవ్ నగర్ ఆర్ఓబీ సంఖ్య నూట తొంభై మూడు పనికి సంబంధించి సవరించిన అదనపు ఎనిమిది కోట్ల అరవై ఎనిమిది లక్షల రూపాయలకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని మంత్రి కార్యాలయంలో విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎంపీ వెల్లడించారు. ప్రజలకు అవసరమైన కీలక మౌలిక వసతి పనులు ఆలస్యం కాకుండా ముందుకు సాగాలన్న ఉద్దేశంతో తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన భావించారని తెలిపారు. ఈ నేపథ్యంలో మంజూరు ఉత్తర్వులను వెంటనే జారీ చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు ఇచ్చినట్లు ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు. మాధవ్ నగర్ ఆర్ఓబీ పనులు వేగవంతం కావడంతో నిజామాబాద్ నగర ప్రజలకు రాకపోకల సమస్యలు గణనీయంగా తగ్గుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి: కోదండరాం

- అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామన్న ప్రకటన
- మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమన్న స్పష్టం
- కాంగ్రెస్‌తో పొత్తుపై ఇంకా నిర్ణయం లేదని వివరణ
- సింగరేణి పరిరక్షణకు ఉద్యమ స్ఫూర్తి అవసరం

**హైదరాబాద్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అసంతృప్తి నెలకొన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.



మున్సిపల్ ఎన్నికల విషయంలో తమ పార్టీ వైఖరిని అధికార పార్టీకి ఇప్పటికే తెలియజేశామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలని తెలంగాణ జన సమితి నిర్ణయించుకున్నదని కోదండరాం వెల్లడించారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల అంశంపై కాంగ్రెస్ పార్టీని సంప్రదించామని, ఆ పార్టీ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని చెప్పారు. అయితే తమ పార్టీ మాత్రం ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డపై ఉందని కోదండరాం ఉద్ఘాటించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సింగరేణిని కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లనివ్వబోమని స్పష్టంగా చెప్పారు. తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినేనని వెల్లడించారు. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేసిన సమయంలో భయం లేని వారికి, ఇప్పుడు విచారణ వస్తే ఎందుకు భయం వేస్తోందని ప్రశ్నించారు. అమరవీరుల త్యాగాలతో సాధించిన తెలంగాణలో ప్రజలు పదేళ్లపాటు అధికారమిచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని కోదండరాం విమర్శించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం తప్ప రాష్ట్ర ప్రజలకు లాభం చేకూరలేదని దుయ్యబట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ జన సమితి కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని కోదండరాం తెలిపారు. కేసీఆర్ నిరంకుశ పాలనకు ముగింపు పలకడం, ఉద్యమ ఆకాంక్షల సాధనకు ఒక అవకాశం ఇవ్వడం, ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలన్న ఆశయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చామని ఆయన వివరించారు.


# తెలంగాణ జాగృతిలోకి పలువురు నాయకులు చేరిక

- కల్వకుంట్ల కవిత సమక్షంలో చేరిక
- చార్మినార్, జనగాం నియోజకవర్గాల నుంచి నాయకులు
- కండువా కప్పి ఆహ్వానం
- జాగృతి బలోపేతానికి ముందడుగు

**హైదరాబాద్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** చార్మినార్, జనగాం నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించగా, రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా జాగృతిలో చేరిన నా




యకులకు కల్వకుంట్ల కవిత కండువా కప్పి ఆహ్వానించారు. తెలంగాణ జాగృతి లక్ష్యాలు, ఉద్యమాత్మక ప్రస్థానం పట్ల ఆకర్షితులై తాము ఈ వేదికలో చేరుతున్నామని నాయకులు తెలిపారు. సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలకు జాగృతి చేస్తున్న సేవలను వారు ప్రశంసించారు. తెలంగాణ ఆత్మగౌరవం, మహిళా సాధికారత, భాషా-సంస్కృతి పరిరక్షణ లక్ష్యాలతో జాగృతి ముందుకు సాగుతుందని ఈ సందర్భంగా కవిత పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల్లో యువత, మహిళలు చురుగ్గా భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు.
ఈ చేరికలతో తెలంగాణ జాగృతి మరింత బలోపేతం అవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించే దిశగా అడుగులు వేస్తామని నేతలు వెల్లడించారు. జాగృతి కార్యకలాపాలకు ప్రజల నుంచి మరింత మద్దతు లభిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## ఇల్లు ఓ పెంటగడ్డ.!

ఒంట్లో బాలేకపోయిన,
మనసు మతి తప్పిన,
ఎక్కడేసిన గొంగళి అక్కడే వుంటుంది.
చూసే వాడుండడు.
అడిగే దిక్కుండదు.

కాస్త పట్టించుకోక పోయిన..
ఇల్లు,
ఓ పెంటగడ్డ అవుతుంది.
కాకపోతే,
ఇల్లు బైటికి కనిపిస్తుంది
మనసు లోనే కుప్పకూరుకు
పోతుంది.!!




✍ దియా విఘ్నేష్

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

- సంతోష్ రావుకు సిట్ నోటీసులు
- జనవరి 27న జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణ
- ఇప్పటికే కేటీఆర్, హరీశ్ రావుల విచారణ
- రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం

**హైదరాబాద్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ముఖ్య నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ రావు కు ప్రత్యేక దర్యాప్తు బృందం నోటీసులు జారీ చేసింది. రేపు జనవరి 27న మధ్యాహ్నం మూడు




గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ లో విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు లను ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సంతోష్ రావుకు కూడా నోటీసులు జారీ కావడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. బీఆర్ఎస్ కీలక నేతలకు వరుసగా నోటీసులు అందుతుండటంతో సిట్ దర్యాప్తు వేగం పెరిగిందనే చర్చ జరుగుతోంది. ఈ కేసులో బాధ్యులెవరో తేల్చేందుకు అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. దర్యాప్తు ఎటువంటి మలుపు తిరుగుతుందన్న దానిపై రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.

# రూ.26 వేలకే కారు అంటూ ప్రకటన.. చివరకు దుకాణం ధ్వంసం

- గణతంత్ర దినోత్సవ ఆఫర్ పేరిట ప్రకటన
- పెద్ద ఎత్తున తరలివచ్చిన జనాలు
- కార్లు లేవని చెప్పడంతో ఆగ్రహం
- వ్యాపారిపై కేసు నమోదు

**హైదరాబాద్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):**

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ.26 వేలకే కారు విక్రయిస్తానని ప్రకటించిన ఓ పాత కార్ల వ్యాపారి చివరకు చేతులెత్తేశాడు. ఈ ఘటన హైదరాబాద్ శివారులోని నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వ్యాపారి మోసం చేశాడని గ్రహించిన జనాలు ఆగ్రహంతో అతడి దుకాణాన్ని ధ్వంసం చేశారు.
మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మల్లాపూర్‌కు చెందిన రోషన్ గణతంత్ర దినోత్సవ ప్రత్యేక



ఆఫర్‌గా రూ.26 వేలకే కార్లు విక్రయిస్తానని సామాజిక మాధ్యమాల్లో ప్రకటన ఇచ్చాడు. తన వద్ద ఉన్న 50 కార్లను ఇదే ధరకు అమ్ముతానని పేర్కొనడంతో ఈ సమాచారం వేగంగా వ్యాపించింది.
దీంతో సోమవారం తెల్లవారుజాము నుంచే స్థానికులతో పాటు దూర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు అతడు నిర్వహిస్తున్న దుకాణం వద్దకు చేరుకున్నారు. అయితే వ్యాపారి చాలా సేపటి వరకు అక్కడకు రాకపోవడంతో వచ్చిన వారు ఆగ్రహానికి గురయ్యారు.
తర్వాత అక్కడకు వచ్చిన రోషన్ తన వద్ద కేవలం 10 కార్లు మాత్రమే ఉన్నాయని చెప్పడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహంతో ఊగిపోయిన స్థానికులు అక్కడ ఉన్న కార్లపై రాళ్లతో దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకుని వ్యాపారిపై కేసు

## మేడారం జాతరకు వచ్చే భక్తులకు మంత్రి సీతక్క స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి, మేడారం జాతరకు వచ్చే ప్రతి భక్తునికి హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు.
మేడారం జాతరకు వచ్చే భక్తులందరూ క్రమశిక్షణతో మెలగాలని మంత్రి సీతక్క కోరారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన క్యూ విధానాన్ని తప్పనిసరిగా పాటిస్తూ సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవాలని సూచించారు. భక్తులందరికీ శీఘ్ర దర్శనం కల్పించేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని వెల్లడించారు.
కొంతమంది భక్తుల అత్యుత్సాహం కారణంగా ఇతరులకు ఇబ్బందులు కలగకూడదని మంత్రి హెచ్చరించారు. క్యూ లైన్లను డిస్టర్బ్ చేయకుండా, నిర్వాహకులు సూచించిన మార్గాల్లోనే ముందుకు సాగాలని సూచించారు. ప్రతి భక్తుడు స్వీయ నియంత్రణతో, క్రమశిక్షణతో వ్యవహరించినప్పుడే జాతర సజావుగా జరుగుతుందని తెలిపారు.
కాలినడకన వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క సూచించారు. ఓవర్ స్పీడ్, ఓవర్ టేక్ వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. భక్తుల భద్రత, సౌకర్యం కోసం అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందరూ సహకరించి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను శాంతియుతంగా, భక్తిభావంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ మోసాలకు మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలి: కేటీఆర్


(మొదటి పేజీ తరువాయి)

వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్న ప్రజలు, కాంగ్రెస్ పాలనలో నిరాశకు గురవుతున్నారని అన్నారు. అలాగే శాసనసభ స్పీకర్ వ్యవహారంపై విమర్శలు గుప్పిస్తూ, చేవెళ్ల యాదయ్య కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నా స్పీకర్ గుర్తించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.
కాలె యాదయ్య తనను గెలిపించిన పార్టీని వదిలి పదవులు, లాభాల కోసం కాంగ్రెస్‌లో చేరారని కేటీఆర్ విమర్శించారు.




కాంగ్రెస్‌కు దమ్ముంటే తమ పార్టీలో చేరిన యాదయ్యపై చర్యలు తీసుకుని ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని, కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని పేర్కొంటూ, అందరూ కలిసి కాంగ్రెస్ పార్టీని ఓడించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## చైనా మాంజాతో మరో ప్రాణహాని



(మొదటి పేజీ తరువాయి)

వివరాల ప్రకారం, వివేకానందనగర్ హైవే వద్ద చైనా మాంజా బాలిక నిష్విక మెడకు చుట్టుకుంది. ఒక్కసారిగా అదుపు తప్పి ఆమె కిందపడిపోయింది. తీవ్ర గాయాలవల్ల బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మాంజా ఎలా అక్కడికి చేరింది, ఎవరు విక్రయించారనే అంశాలపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.
చైనా మాంజా సాధారణ నూలు దారం కాదని అధికారులు మరోసారి హెచ్చరిస్తున్నారు. నైలాన్ లేదా సింథటిక్ పదార్థంతో తయారయ్యే ఈ దారంపై గాజు ముక్కల పొడి పూయడం వల్ల ఇది పక్షుల రెక్కలు, మనుషుల నరాలను కోసేంత ప్రమాదకరంగా మారుతుంది. తెలంగాణ ప్రభుత్వం చైనా మాంజా అమ్మకాలు, వినియోగంపై నిషేధం విధించినప్పటికీ, కొందరు రహస్యంగా విక్రయించడం వల్ల ఇలాంటి ప్రాణాంతక ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌లు వినిపిస్తున్నాయి.

## నాంపల్లి అగ్ని ప్రమాదంలో ధైర్యసాహసాలు చూపిన వారికి అభినందనలు: సీపీ సజ్జనార్

**హైదరాబాద్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** నాంపల్లి ప్రాంతంలో జరిగిన ఫర్నిచర్ షాప్ అగ్ని ప్రమాద సమయంలో ప్రాణాలకు తెగించి సహాయక చర్యల్లో పాల్గొన్న అఫ్జల్‌గంజ్‌కు చెందిన దినేష్ ధైర్యసాహసాలు అభినందనీయమని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న వేళ కూడా బాధితులను రక్షించేందుకు వెనకడుగు వేయకుండా ముందుకు రావడం సమాజానికి ఆదర్శమని అన్నారు. ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు చాలామంది వీడియోలు తీస్తూ నిలిచిపోతున్న ఈ రోజుల్లో, ప్రాణాలను లెక్కచేయకుండా సహాయం చేయడం నిజమైన మానవత్వానికి నిదర్శనమని సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఇటువంటి పౌరులే సమాజానికి నిజమైన బలం అని, వారి సాహసం పోలీస్ శాఖకే కాదు ప్రజలందరికీ గర్వకారణమని అన్నారు. ఈ ఘటనలో దినేష్‌తో పాటు మహమూద్ జకీర్, కలీం, రహీం, అమర్‌లు కూడా



చురుకుగా సహాయక చర్యల్లో పాల్గొన్నారని సీపీ గుర్తుచేశారు. అలాగే కార్పొరేటర్లు సురేఖ ఓం ప్రకాశ్, జఫర్ ఖాన్‌లు చూపిన చొరవ అభినందనీయమని తెలిపారు. అందరి సమన్వయంతోనే పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇలాంటి సాహసవంతులను సత్కరించుకోవడం ద్వారా సమాజంలో మంచి విలువలను ప్రోత్సహించినట్టవుతుందని సీపీ సజ్జనార్ అన్నారు. ఆపద సమయంలో మతభేదాలు లేకుండా అందరూ భుజం భుజం కలిపి ముందుకు రావడం హైదరాబాద్ గంగా-జమునా తహజీబ్ సంస్కృతికి మరో సాక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు.

# జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు..





- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సన్న వడ్లు పండించిన 39,475 రైతుల ఖాతాలో 113 కోట్ల 57 లక్షలు జమ
- 26 కోట్ల 31 లక్షల సబ్సిడితో 9 లక్షల 30 వేల గ్యాస్ సిలిండర్ లు సరఫరా
- విద్యా, వైద్య శాఖల పని తీరు మెరుగయ్యేలా ప్రత్యేక కార్యాచరణ
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరించి తన సందేశాన్నిచ్చిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, జనవరి- 26(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధ చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన వేడుకలలో జిల్లా కలెక్టర్ పాల్గొని, పోలీసు గౌరవం వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ తన సందేశం ఇచ్చారు.

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సన్న వడ్లు పండించిన 39 వేల 475 మంది రైతుల ఖాతాలలో 113 కోట్ల 57 లక్షల బోనస్ జమ చేశామని, 19 కోట్ల రూపాయల సబ్సిడీ మంజూరు చేసి ప్రస్తుత సంవత్సరం నూతనంగా మరో 8 వేల 636 ఎకరాలలో ఆయిల్ పామ్ పంట విస్తరించినట్లు కలెక్టర్ తెలిపారు.

అర్హులైన నిరుపేద కుటుంబాలకు రేషన్ క్రింద సన్న బియ్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నూతనంగా 55 వేల 494 రేషన్ కార్డులు జారీ చేయడం ద్వారా అదనంగా 2,16,543 మంది పేదలు రేషన్ ద్వారా సన్న బియ్యం పొందుతున్నారని, మహాలక్ష్మీ పథకం క్రింద జిల్లాలోని 2 లక్షల 43 వేల మంది లబ్దిదారులకు 9 లక్షల 30 వేల గ్యాస్ సిలిండర్లను 26 కోట్ల 31 లక్షల సబ్సీడితో 500 రూపాయలకే అందజేశామని, ఆర్టిసి బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయడం ద్వారా 255 కోట్ల 97 లక్షల రూపాయలను ఆదా చేసినట్లు తెలిపారు. జిల్లాలో నిరుపేదలకు 16 వేల 523 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి, ఇప్పటి వరకు లబ్ధిదారుల ఖాతాలలో 400 కోట్ల 72 లక్షల నిధులు జమ చేశాం. గృహజ్యోతి పథకం క్రింద జిల్లాలో 200 యూనిట్లకు లోబడి విద్యుత్తును వినియోగిస్తున్న 2,46,855 మంది కుటుంబాలకు 200 కోట్ల 53 లక్షల సబ్సిడీ భరించి జీరో బిల్ జారీ చేశామని అన్నారు.

సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా పాలేరు లింక్ కాలువ ద్వారా పాలేరు రిజర్వాయర్ దిగువన ఉన్న ఎన్.ఎస్.పి. ఎడమ కాలువ, వైరా, లంకాసాగర్ ప్రాజెక్ట్, చిన్న నీటి వనరులలో సాగునీరు అందించే ప్యాకేజీ 15 పనులు పూర్తి కాగా ప్యాకేజీ 14, 16 పనులు పురోగతిలో ఉన్నాయని, సత్తుపల్లికి సాగునీరు అందించే సత్తుపల్లి ట్రంక్ పనులు (ప్యాకేజీ 9 & 10), కాలువ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు.

రఘునాథపాలెం మండలంలో 66 కోట్ల 33 లక్షలతో నిర్మించిన మంచుకొండ ఎత్తిపోతల పథకం ప్రారంభించామని, చింతకాని మండలంలో 2500 ఎకరాల ఆయకట్టు సాగునీరు అందించేందుకు కొదుమూరు వందనం సెకండ్ ఫేజ్ లిఫ్ట్ పనులు 35 కోట్ల 75 లక్షలతో చేపట్టినట్లు తెలిపారు.

వృథాగా పోతున్న 50 నుంచి 60 టీఎంసీల మున్నేరు జలాలను వినియోగించుకుంటూ లక్షా 38 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, ప్రతి సంవత్సరం 120 కోట్ల విద్యుత్ భారం తగ్గించుకునేందుకు 4500 క్యూసెక్కుల సామర్థ్యంతో కూడిన మున్నేరు పాలేరు లింక్ కేనాల్ ను 162 కోట్ల 54 లక్షలతో చేపట్టామని అన్నారు.

నిరుపేదలకు ఆరోగ్య భద్రత కల్పించే రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం క్రింద జిల్లాలో 29 వేల 578 మంది రోగులు 85 కోట్ల 52 లక్షల లబ్ది పొందారని అన్నారు. జిల్లాలో 38 ఆరోగ్య ఉప కేంద్రాలు, సత్తుపల్లి లోని 100 పడకల ఆసుపత్రి, కల్లూరు లోని 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలో ఆ భవనాలను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ అన్నారు. మధిరలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని ఇటీవలే డిప్యూటి సీఎం చేతుల మీదుగా ప్రారంభించుకున్నామని, వైరా, కూసుమంచి లలో 100 పడకల ఆసుపత్రులను నూతనంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు.

ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంచేందుకు జిల్లాలో ప్రత్యేకంగా ఎవ్రీ చైల్డ్స్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని, ఫోనెటిక్స్ ద్వారా పదాలను గుర్తించడం, వ్యాక్యాలను సొంతంగా చదవడం లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి కొనసాగుతోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్.ఆర్.ఎస్. విధానం ద్వారా విద్యార్థుల సరాసరి హాజరు 85 శాతం, ఉపాధ్యాయుల హాజరు 87 శాతంతో ఖమ్మం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు. ప్రభుత్వం నూతన భవన నిర్మాణం కోసం కూసుమంచి జూనియర్ కళాశాలకు 5 కోట్ల 50 లక్షలు, సిరిపురం జూనియర్ కళాశాలకు 5 కోట్లు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి మధిర జూనియర్ కళాశాలకు 4 కోట్లు, ముదిగొండ జూనియర్ కళాశాలకు కోటి 76 లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.

ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద ఎర్రుపాలెం మండలం రాజులపాలెం గ్రామం, కల్లూరు మండలంలోని చిన్న కోరుకోండి గ్రామంలో మహిళా సంఘాల ద్వారా 2 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఉత్పత్తి ప్రణాళికలు చేపట్టామని, జిల్లాలోని బోనకల్ మండలంలోని 22 గ్రామాలలో పూర్తి స్థాయిలో సోలార్ ద్వారా విద్యుత్ సరఫరా చర్యలు చేపట్టామన్నారు.

జిల్లాలోని ములుగుమాడు గ్రామం రీ సర్వే జరిపి 848 మంది రైతులకు వ్యక్తిగతంగా భూమి రేఖాంశాలు, అక్షాంశాలతో మ్యాప్స్ తయారుచేసామని, జిల్లా వ్యాప్తంగా 306 మంది లైసెన్స్డ్ సర్వేయర్ లుగా నియమితులయ్యారని తెలిపారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద జిల్లాలో ప్రస్తుత సంవత్సరం లక్షా 18 వేల కుటుంబాలకు 79 కోట్ల 19 లక్షలు ఖర్చు చేసి ఉపాధి చేకూర్చడం ద్వారా సాంప్రదాయ నీటి వనరుల పునరుద్ధరణ, సిసి రోడ్ల నిర్మాణం, పిల్ల కాలువలు, ఇతర కాలువల పూడిక తీత పనులు పూర్తి చేసామన్నారు.

10 వేల 714 సంఘాలకు 1 వేయి 158 కోట్ల 74 లక్షలు బ్యాంకు లింకేజ్ రుణాలను పంపిణీ చేసామని అన్నారు ఇందిరా మహిళా డెయిరీ పైలెట్ ప్రాజెక్టు క్రింద స్వయం సహాయక సంఘ సభ్యులకు 80 శాతం సబ్సిడీతో ఒక్కొక్కరికి 2 పాడి గేదేల చొప్పున పంపిణీ చేయుటకు ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేయడం జరిగిందని అన్నారు.

వడ్డీ లేని రుణాల పథకం క్రింద పట్టణ ప్రాంతంలోని 936 మహిళా సంఘాల సభ్యులకు 3 కోట్ల 96 లక్షల వడ్డి లేని రుణాలు అందించామని అన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా అందించిన శిక్షణ కారణంగా జిల్లాలో ఉన్న 173 మంది నిరుద్యోగ యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారని అన్నారు.

జిల్లాలో పోడు పట్టాలు పొందిన గిరిజన 11 వేల 786 మంది రైతులకు గల 27 వేల 447 ఎకరాలలో ఇందిర సౌర గిరి జల వికాసం పథకం క్రింద రాబోయే 5 సంవత్సరాల పరిధిలో సౌర పంపు సెట్, డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థ ఏర్పాటు చేయుటకు కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు.

కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకాల క్రింద ఆడపిల్లల వివాహాల నిమిత్తం ప్రభుత్వం 202526 సంవత్సరంలో ఇప్పటి వరకు 3 వేల 752 మంది లబ్దిదారులకు 37 కోట్ల 59 లక్షల 36 వేల రూపాయలను, జిల్లాలోని 4 వేల 893 కార్మికులకు వివిధ పథకాల క్రింద 22 కోట్ల 26 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించామని అన్నారు.

155 కోట్లతో ఖమ్మం మిర్చి మార్కెట్ యార్డును మోడల్ గా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపట్టామని, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులను ప్రభుత్వం 19 కోట్ల 90 లక్షలతో నిర్మించినట్లు తెలిపారు. నూతనంగా మత్కెపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటిని ఏర్పాటు చేశామని, నాబార్డ్ సహకారంతో 60 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో 15 కొత్త గోదాములను నిర్మిస్తున్నామని అన్నారు.

జిల్లాలోని 2003 మంది మల్టిపర్పస్ వర్కర్లకు ప్రభుత్వంచే ప్రమాద భీమా కల్పించామని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించి, నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లకు పంచాయతీల పరిపాలన పై ప్రత్యేక శిక్షణ అందించామని అన్నారు.

ఆర్ అండ్ బీ శాఖ ద్వారా 180 కోట్లతో మున్నేరు నదిపై తీగల వంతెన నిర్మాణ పనులు, 130 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 140 కోట్లతో 10 రెండు వరుసల రహదారులను, నాలుగు వరుసల రహదారులుగా విస్తరించామని అన్నారు.

ప్రభుత్వ ఐటిఐ ఖమ్మంలో 31 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటిసి) నిర్మించామని జిల్లాకు మరొక నాలుగు ఏటీసీ సెంటర్లు మధిర, తిరుమలాయపాలెం, ఏన్కూర్, సత్తుపల్లిలలో ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు.

ఖమ్మం వెలుగుమట్ల అర్బన్ పార్క్ లో 4 కోట్ల అంచనా వ్యయంతో కొత్త సైక్లింగ్ ట్రాక్ లు, బ్యాటరీ వాహనాలు, పార్క్ సదుపాయాలు, ఓపెన్ జిమ్ విస్తరణ, సోలార్ పార్కింగ్ పనులు చేపట్టామని అన్నారు. అమృత్ పథకం క్రింద 229 కోట్లతో ఖమ్మం నగరంలో చేపట్టిన మంచి నీటి సరఫరా పనులు తది దశలో ఉన్నాయని తెలిపారు.

టి.యూ.ఎఫ్.ఐ.డి.సి. క్రింద మధిర మున్సిపాల్టీలో 128 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులు, ఎస్.డి.ఎఫ్. క్రింద 140 కోట్లతో మధిరలో వరద ముంపునకు శాశ్వత పరిష్కారం కోసం రిటైనింగ్ వాల్, అమృత్ పథకం క్రింద 17 కోట్ల 9 లక్షలతో మధిర పట్టణంలో నూతన వాటర్ ట్యాంకర్ల పనులు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో నేలకొండపల్లి బౌద్ధ స్థూపం, పాలేరు లేక్, ఖమ్మం ఖిల్లా, వెలుగు మట్ల అర్బన్ పార్క్ వంటి పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు చేపట్టామని, జమలాపురం వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద అటవీ పార్క్, కాటేజీ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నా యని, 29 కోట్లతో ఖమ్మం ఖిలా రోప్ వే, పాలేరు లేక్ పార్క్, నేలకొండపల్లి బౌద్ధ స్తూపాల అభివృద్ధి, మధిర పెద్ద చెరువు, మామునూరు పేట చెరువు వద్ద పర్యాటక వసతుల కల్పనకు పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.

అనంతరం గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీసు పరేడ్ గ్రౌండ్ కు విచ్చేసిన స్వాతంత్ర్య సమరయోధులను జిల్లా కలెక్టర్ కలిసి ఘనంగా సన్మానించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు:
గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పరేడ్ గ్రౌండ్ లో పందిళ్లపల్లి పిఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్., హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కృష్ణప్రసాద్ మెమోరియల్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకొనగా, సంభాని నగర్ జిపిఎస్., కొత్తగూడెంకు చెందిన ఎంపీపిఎస్ విద్యార్థినీ, విద్యార్థులు సంయుక్తంగా జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో జిల్లాలోనీ ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న *ఎవ్రీ చైల్డ్ రీడ్ ఇంగ్లీష్ వన్ హవర్ ఎవ్రీ డే* అంటూ ప్రదర్శించిన కళాప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకొని ప్రభుత్వ పాఠశాలలో అమలు చేస్తున్న ఈసిఆర్ కార్యక్రమం విశిష్టతను తెలియజేసింది. డిఆర్డిఏ, అటవీ శాఖ, ఎన్పిడిసిఎల్ ద్వార చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ రూపొందించిన శకటాలను ప్రదర్శించారు.

సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం జిల్లా కలెక్టర్ ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేసి ప్రభుత్వ శాఖలు తెలంగాణ పునరుద్ధనీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మునిసిపల్ కార్పొరేషన్ ఇందిరా మహిళా శక్తి ఉత్పత్తులు, జిల్లా విద్యా శాఖ, గిరిజన సంక్షేమం, ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, గురుకులాలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఎన్పిడిసిఎల్, డిఆర్డిఏ., వ్యవసాయ, ఉద్యాన వన శాఖలచే ఏర్పాటు చేసిన స్టాల్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ సిద్దార్థ్ విక్రమ్ సింగ్, డిఆర్ఓ పద్మశ్రీ, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ప్రసాద్ రావు, జెడ్పీ సి ఈ ఓ దీక్షా రైనా, ఫ్రీడం ఫైటర్స్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు, అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# సాయిబాబా నగర్‌లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**కాప్రా, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా డివిజన్ సాయిబాబా నగర్‌లో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విఠల్ నాయక్ మాట్లాడుతూ, మహనీయుల త్యాగాలు మరియు పోరాటాల ఫలితంగా స్వతంత్ర భారతదేశం అవతరించిందని అన్నారు. పరాయి పాలన నుంచి విముక్తి పొందిన భారతదేశానికి బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. ఆ రోజును స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ దేశాభివృద్ధికి ప్రతి పౌరుడు బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాయిబాబా నగర్ యూత్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ మూర్తుజా, చోటు, ప్రదీప్, రియా, ఎం.డి., లుక్మాన్, సమ్మాద్, రెహమాన్, హాషీమ్, అజర్, గీశాంత్, ఫరాహాన్, సీక్రెందర్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్టూర్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**పెద్దమందడి,జనవరి26(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రసంగిస్తూ భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి హక్కులు, స్వేచ్ఛలను కల్పించిందని తెలిపారు.రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొంటూ, దేశాభివృద్ధికి ప్రతి పౌరుడు తన వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి, గ్రామం మాజీ ఉపసర్పంచ్ లు మల్లికార్జున్, నాగమణి నరేష్, గ్రామ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి వడ్డ శేఖర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డిఎస్ మహేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రేమ్ సాగర్, బిజెపి మాజీ మండల అధ్యక్షులు రమేష్, తిరుపతయ్య, టిడిపి మండల అధ్యక్షులు పెద్ద శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకట స్వామి,వార్డు సభ్యులు, ఆశ వర్కర్లు, మహిళా సమైక్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుగా సేవలందిస్తున్న బండి రాజుకు గ్రామస్తుల సన్మానం



**ఈ గౌరవం మరింత బాధ్యతను పెంచింది: జర్నలిస్టు బండి రాజు**

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన జర్నలిస్టు బండి రాజు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ జర్నలిస్టుగా అందిస్తున్న సేవలను గుర్తించిన గ్రామస్తులు, ఉపాధ్యాయ బృందం ఆయనకు చిరు సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ..గ్రామానికి సంబంధించిన సమస్యలు, ప్రజల ఇబ్బందులు, అభివృద్ధి నాయకుల పనితీరు మొదలైన అంశాలను బండి రాజు నిరంతరం వార్తల రూపంలో ప్రచురిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు.ఆయన సేవలు గ్రామాభివృద్ధికి దోహదపడుతున్నాయని ప్రశంసించారు.ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు మాట్లాడుతూ.. సమాజంలో అవగాహన పెంపొందించడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ఆ బాధ్యతను బండి రాజు నిబద్ధతతో నిర్వర్తిస్తున్నారని అన్నారు.సన్మానం అందుకున్న బండి రాజు మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం సందర్భంగా తనను సన్మానించడం ఆనందంగా ఉందని, ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. గ్రామస్తులు చూపిన ఆదరణకు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిజాయితీగా జర్నలిజం కొనసాగిస్తానని, గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, యువతతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మల్లాపూర్ డివిజన్‌లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**మల్లాపూర్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** భారతదేశ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ డివిజన్ పరిధిలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద నగర్ కాలనీ, నాగలక్ష్మి నగర్ కాలనీ, శ్రీనివాస్ నగర్ కాలనీ, అన్నపూర్ణ కాలనీ లోని శ్రీనికేతన్ హై స్కూల్, నరసింహ నగర్ కాలనీలోని మదర్ మీరా హై స్కూల్‌లలో ఏర్పాటు చేసిన జెండా వందనం కార్యక్రమాల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలు మరియు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు ప్రతి భారతీయుడికి ఎప్పటికీ స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో సూర్య చంద్ర యూత్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువ నాయకులు, స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.దేశ స్వాతంత్ర్యానికి, భారత రాజ్యాంగానికి గౌరవం తెలుపుతూ నిర్వహించిన ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రజల్లో దేశభక్తి భావాన్ని మరింత బలపరిచాయని పాల్గొన్న వారు పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవం




**సత్తుపల్లి, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక పట్టణంలో నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఏ.జి.ఎం. రామ్‌కీ మరియు ప్రిన్సిపల్ యనమల రామ్మూర్తి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. భారత రాజ్యాంగంలోని విలువలు, దేశభక్తి, క్రమశిక్షణలను విద్యార్థులు తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాలు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు

# హక్కులతో పాటు, బాధ్యతలను గుర్తించాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ట్యాంక్ బండ్ వద్ద అట్టహాసంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన కలెక్టర్






**ఖమ్మం బ్యూరో, జనవరి- 26(తెలంగాణ ముచ్చట్లు):** 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్థానిక లకారం ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.

కలెక్టర్ సాంస్కృతిక కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణతంత్రం అంటే కేవలం హక్కులు మాత్రమే కాదని, బాధ్యతలు కూడా అని అన్నారు. దేశాభివృద్ధిలో మన వంతు పాత్ర పోషించినప్పుడే రాజ్యాంగ ఆశయాలు నెరవేరుతాయన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలో రూపొందించబడిన మన రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమని తెలిపారు. మన రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, కోట్లాది భారతీయుల స్వేచ్ఛ, సమానత్వం న్యాయానికి సజీవ సాక్ష్యమని అన్నారు. కుల, మత, వర్గ విభేదాలు లేకుండా ప్రతి పౌరుడికి సమాన హక్కులను కల్పించిన గొప్ప పత్రం మన రాజ్యాంగమని కలెక్టర్ అన్నారు. గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్, శ్రీ చైతన్య విస్ట, న్యూ విజన్ హైస్కూల్, టిజిడబ్ల్యుఆర్ఎస్, టేకులపల్లి, కెజిబివి అర్బన్, హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్, తెలంగాణ విద్యారణ్య స్కూల్ ల దేశ భక్తి స్పూరించే గేయాలు, క్లాసికల్, మాస్, జానపద గేయాలకు నృత్యాలు వీక్షకులను ఎంతో అలరించాయి.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా విద్యాధికారిని చైతన్య జైని, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాస చారి, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, అధికారులు, పెద్ద సంఖ్యలో వీక్షకులు పాల్గొన్నారు.

# ఏదులాపురం మున్సిపాలిటీని రోల్ మోడల్‌గా తీర్చుదిద్దుతా : మంత్రి పొంగులేటి

- రూ. 2.5 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- గత ప్రభుత్వం కమీషన్ల కోసమే కాళేశ్వరం కట్టింది
- అర్హులైన ప్రతి పేదవానికీ ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు





**ఖమ్మం బ్యూరో, జనవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** రాబోయే రోజుల్లో ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక ఆదర్శవంతమైన (రోల్ మోడల్) మున్సిపాలిటీగా తీర్చుదిద్దడమే తన లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సుమారు రూ. 2.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సి.సి. రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

నిధుల వరద.. అభివృద్ధి బాధ్యత నాదే..

ఈ పర్యటనలో భాగంగా మంత్రి పొంగులేటి కోటనారాయణపురంలోరూ. 22.6లక్షలతో సి.సి. డ్రైను నిర్మాణానికి, ఎస్సీ బీసీ కాలనీలో రూ. 72 లక్షల వ్యయంతో అంతర్గత సి.సి. రోడ్లు, డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే గుదిమళ్లలో రూ. 44.55 లక్షలతో, ఇందిరమ్మ కాలనీ 1లో రూ. 75.85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సి.సి. రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. వీటితో పాటు నంద్యాతండాలో రూ. 26.55 లక్షల వ్యయంతో డ్రైన్లు, జంగాల కాలనీలో రూ. 14.10 లక్షలతో సి.సి. రోడ్లు, డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే పూర్తి బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

కమీషన్ల కోసమే గత ప్రభుత్వం ఆరాటం..

ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మంత్రి ఘాటు విమర్శలు చేశారు. "కాళేశ్వరం ప్రాజెక్టు కడితే లక్షల కోట్ల కమీషన్లు వస్తాయనే ఆశతోనే గత పాలకులు దానిపై దృష్టి పెట్టారు. కానీ పేదలకు ఇళ్లు కడితే కమీషన్లు రావనే సాకుతో ఆ పథకాన్ని పూర్తిగా విస్మరించారు" అని మండిపడ్డారు. పేదవారి కష్టం తెలిసిన ప్రభుత్వం తమదని, అందుకే అర్హులైన ప్రతి పేదవానికీ ఇళ్లతో పాటు ఇళ్ల స్థలాలు కూడా ఇస్తామని ప్రకటించారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట

సంక్షేమ పథకాల అమలులో ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. గత ప్రభుత్వం రైతు బంధు కింద రూ. 10 వేలు మాత్రమే ఇస్తే, తమ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ. 12 వేలు అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోందని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ప్రజల దీవెనలు తమ ప్రభుత్వంపై ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తిరిగి జెండాతో సత్తుపల్లి పట్టణం ఉత్సాహం

- ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు.



**సత్తుపల్లి, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా సత్తుపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో 100 అడుగుల ఎత్తైన జాతీయ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడటం, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, ప్రజాప్రతినిధులు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ గీతాలాపన అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల సేవలను స్మరించారు. అనంతరం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం, మెయిన్ రోడ్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, గాంధీజీల ఆశయాలను ప్రజలు ఆచరణలో పెట్టాలని నేతలు సూచించారు. తదుపరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. యువత రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను గుర్తుంచుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం రోజునే ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ దంపతుల వివాహ వార్షికోత్సవం కావడం విశేషం. ఈ సందర్భంగా పలువురు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి, అలాగే సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు, పార్టీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# బలీదుపల్లి గ్రామంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**అడ్డాకుల,జనవరి26(తెలంగాణ ముచ్చట్లు):** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామంలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్వాడి కేంద్రం, అంబేద్కర్ విగ్రహం వద్ద, అలాగే ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థి-విద్యార్థినులకు గ్రామ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సువర్ణలత సన్మానించారు.అలాగే ప్రాథమిక పాఠశాల స్కూల్ చైర్మన్ మంగరాయి భార్గవిని సైతం సన్మానించడం జరిగింది.గ్రామ ప్రాథమిక పాఠశాలకు అవసరమైన సామాగ్రిని దాతలు మన్యపు రెడ్డి టీవీ, దామోదర్ రెడ్డి డ్రమ్స్, వేణుగోపాల్ రెడ్డి ప్లేట్స్, సర్పంచ్ కరుణాకర్ రెడ్డి క్రీడా బహుమతులు అందజేశారు.విద్యార్థుల కోసం దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకారం అందించినందుకు ప్రధానోపాధ్యాయురాలు సువర్ణలత కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కళ్యాణి, ఉప సర్పంచ్ రాధా శివ, మాజీ సర్పంచ్ పద్మ, ఉపాధ్యాయులు భాస్కర్, శోభారాణి, శాంతాబాయి, అంగన్వాడి టీచర్ అరుణమ్మ, గ్రామంలోని తొమ్మిది మంది వార్డు సభ్యులు, గ్రామస్తులు వేణు, దేవరాజ్, అంబేద్కర్ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ



గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న ఆర్డీవో కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మండల రెవెన్యూ అధికారి (ఎమ్మార్వో) వెంకటేశ్వర్లు తాసిల్దార్ కార్యాలయం ముందు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గణతంత్ర దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు.

ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో సీఐలు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొని దేశభక్తి నినాదాలు చేశారు.

అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో కార్యదర్శి జున్ను భాస్కర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అన్ని కార్యాలయాల్లో దేశభక్తి వాతావరణం నెలకొంది.

# యువతలో జాతీయ స్పూర్తి నింపిన గణతంత్ర దినోత్సవం



**పెద్దమందడి,జనవరి26(తెలంగాణ ముచ్చట్లు):** గణతంత్ర దినోత్సవ శుభ సందర్భంగా పెద్దమందడి మండలం మద్దిగట్ల జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో దేశభక్తి వాతావరణంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశభక్తికి ప్రతీక అయిన మహానేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని స్మరించుకుంటూ యువతలో జాతీయ చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఘనంగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మద్దిగట్ల గ్రామ సర్పంచ్ రాములు యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించాలనే సేవాభావంతో ఈ కార్యక్రమానికి అవసరమైన బహుమతులను జె. మల్లేష్, జె. తిరుపతయ్య కుమారుడు, ఉదారంగా సమకూర్చారు.విద్యార్థుల్లో ఆలోచనల్లో అగ్ని, హృదయాల్లో దేశభక్తి, లక్ష్యాల్లో నాయకత్వం అనే స్పూర్తిని నింపే విధంగా ఈ కార్యక్రమం సాగిందని మద్దిగట్ల గ్రామ సర్పంచ్ రాములు యాదవ్ తెలిపారు.ఇలాంటి కార్యక్రమాలు యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు ప్రతి భారతీయుడు కృతజ్ఞతలు తెలుపాలి



- ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు – ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**స్టేషన్‌ఘనపూర్, జనవరి 26: తెలంగాణ ముచ్చట్లు:** 77వ గణతంత్ర దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామని స్టేషన్‌ఘనపూర్ మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలోని ప్రతి పౌరుడికి—ఉన్నవారు, లేనివారు, చదువుకున్నవారు, చదువుకోనివారు అనే తేడా లేకుండా, కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా సమాన హక్కులు కల్పించడమే లక్ష్యంగా రూపొందించబడిందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగాలలో భారత రాజ్యాంగం ఒకటిగా గుర్తింపు పొందిందని, ఈ మహత్తర రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు ప్రతి భారతీయుడు కృతజ్ఞతలు తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. కొందరు కావాలనే రాజ్యాంగ విలువలను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని, దేశాన్ని బలహీనపరిచే కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా దేశవ్యాప్తంగా దళితులు, బీదలు, మహిళలపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. కులం, మతం పేరుతో దళితులపై జరుగుతున్న దాడులను ప్రజలంతా ఐక్యంగా ఎదుర్కోవాలని ఆయన కోరారు. రానున్న రోజుల్లో రాజకీయ వ్యవస్థలో విలువలు క్రమంగా క్షీణిస్తూ, రాజకీయాలు అస్తవ్యస్తంగా మారుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ఉండాల్సిన రాజకీయాలు స్వార్థ ప్రయోజనాలకు పరిమితమవుతున్నాయని అన్నారు. ఒకప్పుడు రైతు తన వ్యవసాయంలో కష్టపడి ఫలితాన్ని పొందినట్లే, రాజకీయాల్లో కూడా క్రమశిక్షణ, విలువలు అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాజకీయాలు దిశ తప్పిన వ్యవసాయంలా మారడం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ప్రమాద సంకేతమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక


# ఈసిఐఎల్ ఆటో స్టాండ్‌లో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు





**కుషాయిగూడ, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** భారత దేశ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈసిఐ ఎల్ ఆటో స్టాండ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం జాతీయ జెండా ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి సురేష్ గుప్తా (టీడీపీ టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, మీనాక్షి నగర్ కాలనీ అధ్యక్షులు) ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశభక్తి నినాదాలతో పరిసర ప్రాంతం మార్మోగింది.ఈ సందర్భంగా సురేష్ గుప్తా మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన మహత్తర గ్రంథమని పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతతో పాటు ప్రతి పౌరుడిపై ఉందని తెలిపారు. దేశ అభివృద్ధి, సమగ్రత కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో లక్ష్మీ నారాయణ, నాగేష్ రాజు, మజిద్, చార్లీ, బాలు, అంజీ, శేషు, భీమ, కిషన్ నాయక్, సోను, బాబు తదితరులు పాల్గొని గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని పాల్గొన్న వారు పేర్కొన్నారు.అనంతరం మిఠాయిలు పంచి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ప్రశాంతంగా, ఉత్సాహభరితంగా ముగిసింది.

# షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు





**సత్తుపల్లి, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ సత్తుపల్లి డివిజన్ ఆధ్వర్యంలో వసతిగృహ విద్యార్థుల సత్తుపల్లి డివిజన్ స్థాయి సాంస్కృతిక కార్యక్రమాన్ని సత్తుపల్లి ప్రభుత్వ బాలుర వసతిగృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి, వేంసూరు, బి గంగారం, కల్లూరు, సత్తుపల్లి టౌన్, అడసర్లపాడు, కుంచపర్తి, తల్లాడ, ఎంజెపల్లి, కారేపల్లి, తిమ్మారావుపేట వసతిగృహాల నుంచి కళాశాల, పాఠశాల స్థాయి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఏ.ఎస్సీ.డీ.ఓ. ఎం. వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, చదువుతో పాటు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, వారి సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. అనంతరం ఈ వేడుకల్లో పాల్గొని విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు బి. వెంకటేశ్వర రావు, ఎస్.కే. దారుగాబి, సి.హెచ్. కృష్ణ, సుశీల రామకృష్ణ, ఏం. రమేష్, సి.హెచ్. రామనరేష్, తిమ్మిడి నాగరాజు, వై. తిరుపతమ్మ, కె. ఉపేంద్ర, జూనియర్ అసిస్టెంట్ ప్రీతి మరియు నాలుగవ తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

# మణిగిల్ల గ్రామ పాఠశాలలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**పెద్దమందడి,జనవరి26(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలోని పాఠశాల మరియు అంగన్వాడీ సెంటర్ల చిన్నపిల్లల స్కూల్‌లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.భారత రాజ్యాంగం 1950 జనవరి 26న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు.రాజ్యాంగం అమలుకు ముందు పేద, బడుగు బలహీన వర్గాలు, గిరిజనులు విద్యకు దూరంగా ఉండేవారని, రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత విద్య హక్కుగా మారి పేద విద్యార్థులకు ఉన్నత విద్యకు మార్గం సుగమమైందని తెలిపారు. విద్యార్థులు భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. అలాగే విద్యార్థుల కోసం త్వరలో ఉచిత ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ పాఠశాలలో పారిశుద్ధ్యం మెరుగుపరచడంతో పాటు మంచినీటి వసతులు కల్పిస్తామని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 10/10 ఉత్తీర్ణత సాధించి మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులకు రూ.20,016 నగదు బహుమతి అందిస్తామని ప్రకటించారు.అదేవిధంగా పాఠశాలలో సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ ఆటపోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ముప్పూరి గణేష్ కుమార్, వార్డు మెంబర్లు శ్రీకాంత్ రెడ్డి, కావలి సరోజ, జాజలి గణేష్ కుమార్, అనురాధ, ఊదరి శాంతమ్మ, ఊదరి వెంకటయ్య, పి. జయమ్మతో పాటు గ్రామ పెద్దలు సుంచర మౌని రాములు, పోతుల రాంరెడ్డి, మధిరాల రాంరెడ్డి, గొంది రామకృష్ణారెడ్డి, ఎం.బుచ్చన్న, కొముులయ్య, నరసింహారెడ్డి, చెన్నయ్య, రవి, సాయి కుమార్, ఉషన్న, కృష్ణయ్య, ఆనంద్ రెడ్డి, బాలరాజు, శివ శంకర్, రాఘవేంద్ర, మల్లికార్జున్, చందు, సాయి కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, గ్రామ స్వచ్ఛంద కార్మికులు, శివ స్వాములు పాల్గొన్నారు.చివరగా గ్రామ నూతన సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ గ్రామ పెద్దలకు, యువతకు, విద్యార్థులకు 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ‘నా దేశం – నా బాధ్యత’ నినాదంతో గణతంత్ర వేడుకలు




**ఎల్కతుర్తి, జనవరి 26: (తెలంగాణ ముచ్చట్లు) :** ఎల్కతుర్తి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవం భారత రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని గుర్తుచేసే మహత్తర దినమని పేర్కొన్నారు. దేశ ప్రజలకు స్వేచ్ఛ, సమాన హక్కులు కల్పించడంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. కుల, మతాలకు అతీతంగా ‘నా దేశం – నా బాధ్యత’ అన్న భావనతో ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎర్రగొల్లా శ్రీనివాస్ యాదవ్, మండల సీనియర్ నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మండల ఉపాధ్యక్షులు, బీజేవైఎం నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గార్లపాడు గ్రామ జాతీయ జెండా ఆవిష్కరించిన డిఐజి శ్రీనివాస్ రెడ్డి




**జోగులాంబ గద్వాల జిల్లా తెలంగాణ ముచ్చట్లు:** రాజోలిమండల కేంద్రంలో ఉన్నటువంటి పరిమటి గార్లపాడు గ్రామం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ శారదమ్మ ఉప సుజాత ధనుంజయ నాయకుడు రత్నపానంగా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.ఈ సందర్భంగా ఐజి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు కల్పించిందని, వాటిని పరిరక్షించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, సమగ్రత, ఐక్యత కోసం మహనీయులు చేసిన త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత దేశాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే గార్లపాడు గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ ముందుండి పనిచేస్తానన డిఐజి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు సర్పంచ్ శారద ఉప సర్పంచ్ సుజాత ధనుంజయ నాగరాజు రంగన్న కార్యకర్తల పాల్గొన్నారు

# అనూస్ పాఠశాల విద్యార్థులకు అరుదైన అవార్డులు



**వనపర్తి,జనవరి26(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కేంద్రంలోని అనూస్ పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు జ్ఞానవంతమైన విద్యా బోధన అందిస్తూ, భవిష్యత్తుకు దారులు వేసే విధంగా బోధన సాగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్న వయసు నుంచే విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తూ, వారిని చక్కటి విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు.జగత్‌పల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ-రవీందర్ యాదవ్ దంపతుల కుమార్తె విలాసిని, కుమారుడు అభినవ్ చంద్రలు పాఠశాల యాజమాన్యం నిర్వహించిన ఇంటర్నేషనల్ మేథమెటిక్స్ ఒలంపియాడ్ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్స్ సాధించారు. రెండవ తరగతి చదువుతున్న అభినవ్ చంద్ర మూడు పథకాలు, నాలుగవ తరగతి చదువుతున్న విలాసిని రెండు పథకాలు సాధించి పాఠశాలకే గర్వకారణంగా నిలిచారు.ఈ సందర్భంగా సోమవారం 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అనూస్ పాఠశాలలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాఠశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అరుణారెడ్డి, అనుజ్ఞారెడ్డి, స్వాతి రెడ్డిలు తమ సిబ్బందితో కలిసి మెడల్స్ అందజేసి అభినందనలు తెలిపారు.

## "తెలంగాణ ముచ్చట్లు"దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన రాజోలి గ్రామ సర్పంచ్ చింపుల గంగిరెడ్డి



**తెలంగాణ ముచ్చట్లు జోగులాంబ గద్వాల జిల్లా:** రాజోలి మండల కేంద్రంలో అయినటువంటి 77వ రిపబ్లిక్ డే సందర్భంగా గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఈరోజు పత్రికను ఆవిష్కరించిన యూత్ ఐకాన్ కిరణ్ కుమార్ రెడ్డి ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఫుల్ పార్టీ దస్తగిరి కాంగ్రెస్ సెక్రెటరీ అసిన్ పార్టీ లీడర్లు వార్డు నెంబర్స్ అలాగే కార్యకర్తలు గ్రామ ప్రజలు రైతు సోదరులు పాల్గొనడం జరిగింది

## గణతంత్ర వేడుకల్లో విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేసిన జంగం పద్మ శివ



**పెద్దమందడి,జనవరి26(తెలంగాణ ముచ్చట్లు):** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దమందడి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన వేడుకలు విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు నింపాయి. స్థానిక 8వ వార్డు మెంబర్ జంగం పద్మ శివ విద్యార్థుల చదువుపై ఉన్న మక్కువతో, నిరుపేద విద్యార్థులకు అండగా నిలవాలనే సేవా దృక్పథంతో విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో తన సొంత ఖర్చులతో నోట్‌బుక్స్, పెన్నులు, రైటింగ్ ప్యాడ్లు, స్టేషనరీ కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జంగం పద్మ శివ మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు సమాజం పట్ల బాధ్యతను నేర్పాలని, విద్యార్థుల భవిష్యత్తుకు తమ వంతు సహకారం అందించడం ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్‌తో పాటు ఇతర రాజకీయ నాయకులు మాట్లాడుతూ, పదవిలో ఉన్నా లేకున్నా సేవా భావం ఉండాలని, వార్డు మెంబర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్న జంగం పద్మ శివ అందరికీ ఆదర్శప్రాయమని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**పెద్దమందడి,జనవరి26(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాణం విష్ణు జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, రాజ్యాంగ విలువలను పాటిస్తూ దేశాభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మాజీ జెడ్పిటిసి, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# మల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీలోకి భారీ ఎత్తున చేరికలు





**మల్లాపూర్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. మల్లాపూర్ డివిజన్‌లో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో భారీ సంఖ్యలో చేరారు. మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ చేరికల కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పరమేశ్వర్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన కొనసాగుతోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల వల్ల ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పెరిగిందని, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మల్లాపూర్ డివిజన్ వారాల విజయ రెడ్డి, బ్రహ్మపురి కాలనీ అధ్యక్షుడు బంగారోజు విశ్వరూప చారి, కొండల్ రెడ్డి, భూపాల్ రెడ్డి, గురువయ్య, ఖలీల్, సూది నరేందర్, ప్రదీప్, ప్రతాప్ రెడ్డి, చెన్నయ్య, నాగేష్, శ్రీనివాస్ రెడ్డి, మోహన్ రెడ్డి, నూర్, అత్తర్, భాష, సలీం, సోహెల్, ఎండి మీరు, నదీమ్, అలీ, ఖాసీం, అజ్మత్, లల్లు, రమేష్, శ్రీనాథ్, విజయ్, పరమేష్, శ్రీకాంత్, ఇమ్రాన్, ఖదీర్, సోయల్, గణేష్, హరిలాల్, మల్లికార్జున్, కెవిన్, భాను, బన్నీ, శశి, జశ్వంత్, కిరణ్, నరేష్, దేవి ప్రసాద్, దినేష్ కుమార్, భాను చారి, వెంకట్, వీర, కార్తీక్, వినయ్, విష్ణు, అజాం, పద్మ, సుజాత, స్వరూప, రజిత, సుల్తానా, గౌసియా, హలీమా, ఉబీన, యాస్మిన్, ఉమ్మీర్, మున్ని, అక్షయ, సోఫియా, సుల్తానా తదితరులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో నెమలి అనిల్, మల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు కప్రసాయి గౌడ్, ఎస్.వి. కిట్టు, పీజీ సుదర్శన్, దంతూరి రాజు, కోయలకొండ రాజేష్, ప్రభాకర్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, జానీ భాయ్, జమీలా బేగం, శైలజ గౌడ్, జయంత్, సాయి, వినేష్ యాదవ్‌తో పాటు మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సరోజినీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం



**చర్లపల్లి, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ లో 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని చర్లపల్లి భరత్ నగర్ కాలనీలో సరోజినీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని సరోజినీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు పి. కాంతారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి కాలనీతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. నిపుణులైన వైద్యులు పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించి, కంటి సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వారికి తగిన సూచనలు, సలహాలు అందించారు. కొంతమందికి భవిష్యత్తులో తీసుకోవాల్సిన చికిత్సలపై మార్గనిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు పి. కాంతారావు మాట్లాడుతూ, సమాజంలో ఆరోగ్యమే ప్రధాన సంపదని, ముఖ్యంగా కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సరోజినీ ఫౌండేషన్ సభ్యులు, స్థానిక వాసులు, స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

# 108 ఉద్యోగులకు జిల్లా స్థాయి ఉత్తమ సేవా అవార్డులు

- 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఖమ్మం పోలీస్ పరేడ్ మైదానంలో సత్కారం.









**సత్తుపల్లి, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా 108 అంబులెన్స్ సర్వీస్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సోమవారం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఖమ్మం పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా స్థాయిలో అత్యుత్తమ సేవలు అందించిన వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గొల్లమందల కృష్ణ, వేంసూర్ 108 అంబులెన్స్ వాహన చోదకుడు డ్రైవర్ షేక్. అన్వర్, వేంసూర్ 108 అంబులెన్స్ వాహన చోదకుడు డ్రైవర్ కొండ్రు రవి, తల్లాడ 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నల్లగట్ల. రామారావులు తమ ఉత్తమ సేవలకు గాను ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఐఏఎస్ చేత ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు, అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో 108 సర్వీస్ జిల్లా మేనేజర్ అవులూరి దుర్గాప్రసాద్, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షేక్. నజీరుద్దీన్ పాల్గొన్నారు.

# 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించిన ఎస్వీ కృష్ణ



**మల్లాపూర్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మున్సిపల్ గ్రౌండ్ వద్ద 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎస్వీ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.ఈ సందర్భంగా ఎస్వీ కృష్ణ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు కల్పించిందని, వాటిని పరిరక్షించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం, సమగ్రత, ఐక్యత కోసం మహనీయులు చేసిన త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువత దేశాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు.అలాగే మల్లాపూర్ డివిజన్ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడూ ముందుండి పనిచేస్తానని ఎస్వీ కృష్ణ స్పష్టం చేశారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, ఫిరోస్ ఖాన్, యాధిరెడ్డి, రవి, సాయిబాబా, ఆశు, ఎస్వీ ప్రసాద్, బాల్‌రాజ్, సతీష్, రాజేష్, సెతీష్, నిరంజన్, సంజయ్, అక్బర్, అన్వర్, రవీందర్, రవిధూబే, వాసు, రాజు, షబ్బీర్, సానియా, స్వీటీ, స్వేత, లలిత, సఖి, లక్ష్మి, జయమ్మ, ప్రమీల, గీతాదేవి, శాంతిదేవి, గణేష్ గౌడ్, మల్లేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలకు విశేష ఉత్సాహాన్ని అందించారు.

# కాప్రా ప్రెస్ క్లబ్ వద్ద ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**కాప్రా, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుషాయిగూడ ఏసీపీ వై. వెంకటరెడ్డి, కుషాయిగూడ ఇన్స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్సై సాయి హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం, రాజ్యాంగ విలువలను కాపాడడంలో మీడియా పాత్ర కీలకమని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో జర్నలిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉల్లోజు శ్రీనివాస్, కార్యదర్శి వేముల శంకర్, కోశాధికారి రుద్రగోని నర్సింగ్ గౌడ్, ఉపాధ్యక్షులు అదిమూలం శ్రీనివాస్, గోపాల్ గౌడ్, వట్టిపల్లి సురేష్, నటరాజ్ పాల్గొన్నారు. అలాగే సీనియర్ జర్నలిస్టులు, సలహాదారులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయ చారి, కేసరి సహదేవ చారి, కేసి మోహన్, ఎం. చంద్ర మౌళి, శనిగరం అశోక్, కే. సత్యనారాయణ, గడ్డమీది బాలరాజు, కీర శ్రీనివాస్‌తో పాటు జర్నలిస్టులు దామెరపల్లి నర్సింహ రెడ్డి, లక్కిడి బాల్ రెడ్డి, చుక్క రమేష్ శ్రీనివాస్, బసంత్ రెడ్డి, దాచారం రమేష్, బాలకృష్ణ, ప్రభాకర్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# వెల్టూర్ మన చర్చ్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు



**పెద్దమందడి,జనవరి26(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ న్యూ ఎస్సీ కాలనీలోని మనచర్చి వద్ద సోమవారం ఉదయం 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెండావందన పండగను భక్తి, దేశభక్తి భావాలతో జరుపుకున్నారు.

ఈ సందర్భంగా జాతీయ జెండాకు ఘనంగా వందనం అర్పించి, భారత దేశ ఐక్యత, సమగ్రత, శాంతి, సౌభ్రాతృత్వ విలువలను గుర్తు చేసుకున్నారు. దేశ అభివృద్ధికి ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని పాస్టర్ సురేష్ కుమార్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించడంతో పాటు దేశానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి అని సందేశమిచ్చారు.ఈ కార్యక్రమంలో మన చర్చి సభ్యులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# శక్తి సాయి నగర్ లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**శక్తి సాయి నగర్, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శక్తి సాయి నగర్ డివిజన్ బీజేపీ కార్యాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ డీసీ నెంబర్, ఎంబీసీ చైర్మన్ ఉప్పల్‌కు చెందిన సంగిశెట్టి రవీంద్ర సాగర్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంగిశెట్టి రవీంద్ర సాగర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలకు సమాన హక్కులు, స్వేచ్ఛలు కల్పించిందని తెలిపారు. గణతంత్ర దినోత్సవం దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు రాజ్యాంగ విలువలను కాపాడుతూ దేశ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అపర్ణ గౌడ్, మహిళా అధ్యక్షురాలు సబితా యాదవ్, డివిజన్ సెక్రటరీ రమేష్ సాగర్, సీనియర్ నాయకురాలు ఎస్. లలిత, బూత్ అధ్యక్షులు వి. శ్రీనివాస్ సాగర్, పి. లింగం గౌడ్, బూత్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ కురుమ, ఏ. లింగం కురుమ, వెంకటేష్ గౌడ్, చూర్ణం కోటి, వేముల రాజు, వి. శ్రీనివాసులు, ఎండి. కాజా, ఎస్. బుచ్చన్న, ధనుంజయ, సిహెచ్. రాజు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరై గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

# విద్యార్థులు ఉన్నతంగా చదివి దేశ రక్షణలో భాగస్వాములు కావాలి

**భారత ఆర్మీ జూనియర్ కమాండర్ ఏ. రాజు**

**వనపర్తి,జనవరి26(తెలంగాణ ముచ్చట్లు):** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం వనపర్తి పట్టణంలోని ఢిల్లీ వరల్డ్ పాఠశాలలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఆహ్వానం మేరకు భారత ఆర్మీ జూనియర్ కమాండర్ ఆఫీసర్ ఏ.రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల ద్వారా గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా ఏ. రాజు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, ప్రతి విద్యార్థి తనకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగడమే కాకుండా, దేశ రక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ విలువలను కాపాడుతూ దేశాభివృద్ధిలో క్రియాశీల పాత్ర పోషించాలని సూచించారు. స్వాతంత్ర్య పోరాటానికి స్ఫూర్తినిచ్చిన సత్యం, అహింస, శాంతి, సంఘీభావం, సార్వత్రిక సౌభ్రాతత్వం వంటి గొప్ప ఆదర్శాలకు తిరిగి అంకితమయ్యే రోజుగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటామని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఇంద్రనగర్ కాలనీ లో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

**నాచారం, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ నాచారం సర్కిల్ ఇంద్రనగర్ కాలనీ ఫేజ్-2లోని కమిటీ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ జరిపోల ప్రభుదాస్ హాజరై తిరంగా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, దేశ అభివృద్ధికి పౌరులందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు, చాక్లెట్లు పంపిణీ చేసి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం అనంతరం కాలనీలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై కాలనీ పెద్దలు, కమిటీ సభ్యులతో కార్పొరేటర్ చర్చించారు. కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ ప్రెసిడెంట్ సతీష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, సెక్రటరీ హరి, కాలనీ పెద్దలు రంగారెడ్డి, ప్రసాద్, అలిముద్దీన్, వీరారోజు, కృష్ణ గౌడ్, లక్ష్మి, రమేష్ గౌడ్, సలీముద్దీన్, ఆనంద్ కుమార్, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



# సింగరేణి సత్తుపల్లి జీఎం కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవం

- ఉత్పత్తి–రవాణాలో సింగరేణి సత్తుపల్లి ఏరియా ప్రథమ స్థానం.
- జీఎం చింతల శ్రీనివాస్.






**సత్తుపల్లి, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక పట్టణంలో సింగరేణి కొత్త జీఎం కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సింగరేణి సత్తుపల్లి జీఎం చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎస్ & పీసీ, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులతో నిర్వహించిన పరేడ్‌లో ఎన్‌సీసీ దమ్మపేట రెసిడెన్షియల్ విద్యార్థులు, కలర్ పార్టీ, బ్యాండ్ పార్టీ పాల్గొన్నారు. ముఖ్య అతిథి పరేడ్‌ను పరిశీలించి వందన స్వీకారం స్వీకరించారు. ఈ సందర్భంగా చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో సత్తుపల్లి ఏరియా ఉత్పత్తి, రవాణా రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఇది అధికారులు, ఉద్యోగుల సమిష్టి కృషి ఫలితమని పేర్కొన్నారు. అనంతరం ఏరియాలో ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు.
తదుపరి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో త్రివేణి హై స్కూల్, మదర్ తెరిసా హై స్కూల్, చైతన్య టెక్నో స్కూల్, ఎంపీపీ ఎస్ కిష్టారం, ఎంపీపీ కిష్టారం హెచ్‌డబ్ల్యూ, ఎంపీపీ ఎస్ కిష్టారం అంబేద్కర్ నగర్ స్కూల్ విద్యార్థులు ఆకట్టుకునే ప్రదర్శనలు ఇచ్చారు.
ఈ కార్యక్రమాన్ని ఎస్ఓ టు జీఎం బొల్లం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సేవా ప్రెసిడెంట్ సిహెచ్ లక్ష్మీ, ఏరియా ఇంజనీర్ కె. సోమశేఖర రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ కిష్టారం ఓసీ ఏఎల్ఎస్వీ సునీల్ వర్మ, ప్రాజెక్ట్ ఇంజనీర్ జేవీఆర్ ఓసీడీ శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ కిష్టారం ఓసీ జివి రావు, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ డి. రమేష్ బాబు, జేవీఆర్ ఓసీ మేనేజర్ బి. రాజేశ్వర రావు, కిష్టారం ఓసీ మేనేజర్ బి. రామకృష్ణా రావు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎస్. సుధాకర్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ బి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార లక్ష్యంగా అధికారులు పనిచేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. శ్రీజ
- కలెక్టరేట్ లో జాతీయ పతాకావిష్కరణ చేసిన అదనపు కలెక్టర్




**ఖమ్మం బ్యూరో, జనవరి- 26(తెలంగాణ ముచ్చట్లు)**
ప్రజా సమస్యల పరిష్కార లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు.
సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సాధించుకున్న తర్వాత దేశం రాజ్యాంగాన్ని రచించుకొని 26 జనవరి, 1950 న అమలులోకి తెచ్చుకొని ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా రూపుదిద్దుకుందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార లక్ష్యంగా అధికారులు అందరు కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని, రాబోయే మునిసిపల్ ఎన్నికలు అలాగే సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.
ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ, ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై అధికారులు వ్యక్తిగత శ్రద్ధతో, చిత్తశుద్ధితో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లాలో పర్యటించిన మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు

- పలు కుటుంబాలకు మాజీ ఎంపీ నామ పరామర్శ




**ఖమ్మం బ్యూరో, జనవరి 26(తెలంగాణ ముచ్చట్లు)**
బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు సోమవారం నాడు ఖమ్మం జిల్లాలో పర్యటించారు అందులో భాగంగా ముందుగా ఆయన సత్తుపల్లి నియోజకవర్గంలో ని కల్లూరు మండలం పోచారం గ్రామంలో ఇటీవల మరణించిన మధిర సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు, మధిర మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కట్టా గాంధీ దశ దినకర్మకు హాజరై ఘన నివాళులర్పించారు. అనంతరం వారి సతీమణి రాణి తో పాటుగా కుమారులు కట్టా పూర్ణ, సుధీర్, చందు లను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అక్కడ నుండి ఖమ్మం కార్పొరేషన్ పదిహేనవ డివిజన్ అల్లీపురం లో ఇటీవల మరణించిన ఏపూరి రాధమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం చింతకాని మండలం బస్వాపురం గ్రామం లో ఇటీవల రోడ్డు ప్రమాదం లో మరణించిన మంచాల వెంకటేశ్వర్లు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలు వేసి నివాళ్లు అర్పించారు అలానే అదే గ్రామం లో శతాయుష్కురాలైన సోమ శేషమ్మ ఇటీవల మరణించగా వారి నివాసానికి వెళ్లి వారి కుమారులు మాజీ సర్పంచ్ సోమ నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లతో మాట్లాడి పరామర్శించారు.
ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, కల్లూరు మాజీ జడ్పిటీసీలు లక్కినేని రఘు, కట్టా అజయ్ బాబు, కరివేద వెంకటేశ్వరరావు, కనకమేడల సత్యనారాయణ, తాళ్లూరి జీవన్ కుమార్, రావూరి శ్రీనివాసరావు, బిక్కి కృష్ణప్రసాద్, కిలారి రాంబాబు, ఉదయ్, చిత్తారు నాగేశ్వరరావు, మోరంపూడి ప్రసాద్ రావు, బొడ్డు వెంకట్రామారావు, పల్లపోతుల వెంకటేశ్వరరావు, యన్నంశెట్టి అప్పారావు, గొడ్డేటి మాధవరావు, మరికంటి రేణుబాబు, పొల్నిడి కొండల రావు, వాకదాని కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, దొడ్డా శోభన్ బాబు, రోశయ్య, ఆవుల కొరివి తో సహా మధిర, కల్లూరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దాం..

- గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి
- క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ, డీసీసీ ఆఫీస్ లో వేడుకలకు హాజరు




**ఖమ్మం బ్యూరో, జనవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** రాజ్యాంగం ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం ప్రసాదించిందని, గొప్ప విలువలను కాపాడుకుంటూ.. భారత రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిద్దామని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా.. ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ ఆదర్శ పాలనను సాగిస్తోందని వివరించారు.
ఈ కార్యక్రమంలో..: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు కొండబాల కోటేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సిటీ ప్రెసిడెంట్ దీపక్ చౌదరి, సీనియర్ నేత వద్దిబోయిన నరసింహారావు, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, ప్రతిభా రెడ్డి, టిపిసి సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, నాయకులు శ్రీకళా రెడ్డి, హారికా నాయుడు, మియా భాయ్, లింగాల రవికుమార్, మాజీద్ పలువురు కార్పొరేటర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బేతుపల్లి గ్రామంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు




**సత్తుపల్లి, జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు):**
మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ (అమ్ములు) ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది ఆయన తొలి వేడుకగా నిలిచింది. దీంతో గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సాహం మరింతగా పెరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ (అమ్ములు) గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులతో సమావేశం నిర్వహించి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రహదారులు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, విద్యా సంస్థల వసతులు వంటి సమస్యలను గ్రామ పెద్దలు ఆయనకు వివరించగా, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చి క్రమబద్ధంగా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు. అలాగే, ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ దేవత శ్రీ అంకమ్మ తల్లి చరిత్రను సేకరించి నివేదికగా రూపొందించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.
ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులకు ఉత్సాహాన్ని నింపుతూ, పాఠశాల తరఫున బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు వేడుకకు హాజరై ఘనత చేకూర్చారు. గ్రామ అభివృద్ధి కోసం సర్వసమాఖ్యంగా కలిసి పని చేస్తామని సర్పంచ్ దొడ్డా రాజేంద్ర ప్రసాద్ (అమ్ములు) తెలిపారు.

# జానంపేట గ్రామంలో ఘనంగా ఉచిత వైద్య శిబిరం



**పెబ్బేరు,జనవరి26(తెలంగాణ ముచ్చట్లు):** పెబ్బేరు మండలం జానంపేట గ్రామంలో సోమవారం 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జనని హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఇ. రాములు, ఆర్ఎంపీ డాక్టర్ జావిద్, ఉప సర్పంచ్ సి. నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు గడ్డం సుధాకర్ సమక్షంలో ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఎన్. జయచంద్రారెడ్డి, డాక్టర్ ప్రియాంక రెడ్డి గర్భిణీ స్త్రీలకు, చిన్న పిల్లలకు, గ్రామ ప్రజలకు సాధారణ వైద్య సేవలు అందించారు.రక్తపోటు, షుగర్ పరీక్షలతో పాటు అవసరమైన వైద్య సూచనలు ఇచ్చారు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.గ్రామ సర్పంచ్ ఇ. రాములు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు.ఈ వైద్య శిబిరంలో జనని హాస్పిటల్ సిబ్బంది సంపత్, మాధవి, సాయి రాఘవేంద్ర, నందిని, ప్రవళికలతో పాటు గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు.

# ఎల్కతుర్తి సీఐ కార్యాలయంలో ఘనంగా 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



**ఎల్కతుర్తి. జనవరి 26: (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ పులి రమేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.
కార్యక్రమంలో సీఐ పులి రమేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం దేశ స్వాతంత్ర్యానికి, రాజ్యాంగ విలువలకు ప్రతీక అని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు చేసిన త్యాగాల వల్లే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు.
ఆ మహనీయుల ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని, ముఖ్యంగా పోలీస్ విభాగానికి ఇది మరింత కీలకమని తెలిపారు. పోలీస్ శాఖ కేవలం చట్ట అమలు మాత్రమే కాకుండా ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. న్యాయమే లక్ష్యంగా, సేవే స్వభావంగా ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందిస్తూ నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మీడియా మిత్రులు పాల్గొన్నారు. చివరగా పోలీస్ కుటుంబ సభ్యులందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ జైహింద్... జై భారత్ అని నినదించారు.

# రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలి

- మంత్రి పొంగులేటి



**ఖమ్మం బ్యూరో, జనవరి 26(తెలంగాణ ముచ్చట్లు);** భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం సిద్ధించిందని, వారి మేధోకృషితోనే మన రాజ్యాంగం రూపుదిద్దుకుందని కొనియాడారు. ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య దేశంగా భారత్ వర్ధిల్లుతుండటం గర్వకారణమని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాతలను స్మరిస్తూ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, జనవరి - 26(తెలంగాణ ముచ్చట్లు):** 77వ భారత గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సోమవారం జిల్లా కలెక్టర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.




తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ట్రస్మా' ఖమ్మం డివిజన్ అధ్యక్షుడిగా జాఫర్ మతీన్




**ఖమ్మం బ్యూరో, జనవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** స్కూల్ మేనేజ్మెంట్స్ అసోసియేషన్(ట్రస్మా) ఖమ్మం డివిజన్ ఎన్నికలు నగరంలోని గీతాంజలి విద్యా నికేతన్ లో ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో డివిజన్ అధ్యక్షుడిగా జాఫర్ మతీన్ , కార్యదర్శిగా కె. సూరిబాబు, కోశాధికారిగా బి. మోహన్ రెడ్డి ఎన్నికయ్యారు. రాబోయే రోజుల్లో సభ్యుల సహకారంతో పారదర్శకంగా, న్యాయబద్ధంగా, ఐక్యతతో పనిచేస్తామని వారు చెప్పారు. ఎన్నికల అధికారిగా ఎండీ అజారుద్దీన్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, నాయుడు వెంకటే శ్వరరావు, నాసరయ్య పాల్గొన్నారు.



## ఖమ్మం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం బ్యూరో, జనవరి -26(తెలంగాణ ముచ్చట్లు):** 77వ భారత గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.
అంతకుముందు కలెక్టర్, క్యాంపు కార్యాలయంలోని మహాత్మాగాంధి విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



## 127 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

◆ వివిధ మండలాలకు చెందిన వారికి రూ.35లక్షల మేరకు లబ్ధి

**ఖమ్మం బ్యూరో, జనవరి 26(తెలంగాణ ముచ్చట్లు):** ప్రైవేట్, కార్పొరేట్ హాస్పిటళ్లలో అత్యవసర వైద్య చికిత్సలు పొందిన పేద, మధ్యతరగతి ప్రజలను ఆదుకునేందుకు.. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసుతో రాష్ట్ర ప్రభుత్వం 127 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంజూరు చేసింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఖమ్మంలోని గట్టయ్య సెంటర్ లో గల తన క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రఘురాంరెడ్డి వీటిని పంపిణీ చేశారు. తద్వారా వివిధ మండలాలకు చెందిన వారికి మొత్తం రూ. 35 లక్షల మేరకు లబ్ధి చేకూరింది. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ.. పేదల ఆరోగ్యానికి భరోసానిస్తూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం జాప్యానికి తావు లేకుండా సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేస్తోందని తెలిపారు. ఇప్పటికే వేలాది మంది లబ్ధి పొందారని, అర్హులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో..: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కమర్తపు మురళి, కొప్పుల చంద్రశేఖర్, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ నాయకత్వంలోనే రైల్వే సమస్యలకు శాశ్వత పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో అనేక రైల్వే లైన్లు, స్టేషన్లు ఉండటంతో గంటల తరబడి రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్ జామ్లు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ అంశాన్ని తాను పార్లమెంట్లో లేవనెత్తగా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించి, ఎంత ఖర్చైనా సరే అన్ని ఆర్యుబి, ఆర్ఓబిలను పూర్తి చేయాలని ఆదేశించారని చెప్పారు.
రైళ్ల వేగం, ఫ్రీక్వెన్సీ పెరిగిన నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా చిన్నచిన్న ఆర్యుబిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు, రైల్వే లైన్ల వెంబడి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. వచ్చే రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేసి మల్కాజిగిరి ప్రజానీకానికి ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ముప్పై, నలభై ఏళ్లుగా ఎవరు పట్టించుకోని సమస్యలను మోదీ అండతో పరిష్కరిస్తున్నామని చెప్పుకోవడం జబ్బలు చర్చుకోవడం కాదని, కేంద్రం చేసినా రాష్ట్రం చేసినా ప్రజలకు మేలు చేయడమే అసలైన లక్ష్యమని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. ప్రజాసేవకు బదులుగా సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తే ప్రజలు గమనిస్తారని హెచ్చరించారు.

# గ్రామీణ వైద్యులకు ఎల్లవేళలా అండగా ఉంటాం

◆ తుంబూరి దయాకర్ రెడ్డి

**ఖమ్మం బ్యూరో, జనవరి 26(తెలంగాణ ముచ్చట్లు)**




స్థానిక ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో తెలంగాణ మైనారిటీ గ్రామీణ వైద్యుల సంఘం 12వ మహాసభ కార్యక్రమంను పురస్కరించుకొని సోమవారం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ మరియు పాలేరు నియోజకవర్గ బాధ్యులు తుంబూరి దయాకర్ రెడ్డి కరపత్రాలను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యులకు ఎల్లవేళలా అండగా ఉంటాం, ప్రతి సంవత్సరం తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం నిర్వహిస్తున్న మహాసభలు సంఘ బాధ్యుల అంకిత భావాన్ని చాటి చెబుతున్నాయని అన్నారు, గ్రామీణ వైద్యులకు తన అభినందనలు ప్రకటించినారు. మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ హసన్, జిల్లా జనరల్ సెక్రెటరీ షేక్ జానీ మియా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్ హసన్, వ్యవస్థాపకుడు షేక్ నజీరుద్దీన్, కోశాధికారి బాబుసాహెబ్, సంఘ జిల్లా నాయకులు ఆశ, చాంద్ పాషా, మహమ్మద్ సాహెబ్, అఫ్జల్, అమీర్, శ్రీరామ్ గిరి జానీ, జుల్ఫికేర్ అలీ, ఖలీల్, గౌస్ మియా, సుభాని తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ కార్యాలయంలో ఘనంగా భారత 77 వ గణతంత్ర వేడుకలు

**ఖమ్మం బ్యూరో, జనవరి 26(తెలంగాణ ముచ్చట్లు)**





తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, భారత 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, అనంతరం వారి చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ... భారతదేశంలో గణతంత్ర దినోత్సవాన్ని భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజుగా జరుపుకుంటారని. ప్రతి సంవత్సరం జనవరి 26ను భారత గణతంత్ర దినోత్సవంగా జరుపుతారనీ. రాజ్యాంగంన్నీ దేశ పరిపాలనకు మార్చడాన్ని భారత గణతంత్ర దినోత్సవం అంటారని అన్నారు, భారత రాజ్యాంగ నిర్మాణంలో భాగస్వాములైన మహానుభావులకు కృతజ్ఞతలు తెలిపారు, ప్రభుత్వాలు ప్రజలు ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగాన్ని అనుసరించి దేశ భక్తి తో మెలగాలని అన్నారు, ఈ కార్యక్రమంలో కొండ బాల కర్ణాకర్, కేతినేని హరీష్, వడ్డేం విజయ్, గుత్తా సీతయ్య, వనమా వాసు, వాసిరెడ్డి భాస్కరరావు, మంద వెంకట నారాయణ, మీగడ రామారావు, రాజేశ్వరి, మేకల సత్యవతి, పసలం వెంకటేశ్వర్లు, చంద్ర రవి, పెనుగొండ ఉపేందర్, గడిపుడి వెంకటేశ్వర్లు, ప్యారిస్ వెంకన్న, మందపల్లి కోటేశ్వరరావు, గుడెపిన్ని నాగేశ్వరరావు, కందిబండ నరసింహారావు, నల్లమల రంజిత్, కాసాని బ్రహ్మం, మహిళా నాయకురాళ్లు తాడిశెట్టి స్వాతి, మందపల్లి రజిని, కామ అనిత, లావణ్య, పావని, ఘర్ రవీందర్, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో,జనవరి 26 (తెలంగాణ ముచ్చట్లు)**






77వ. భారత గణతంత్ర దినోత్సవం పురస్కారించుకొని ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో ఏర్పాటు చేసిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలసి జిల్లా కలెక్టర్ పోలీస్ కవాతు పరిశీలించారు.
ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధులను సన్మానించారు. జిల్లా యంత్రాంగం పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ను సందర్శించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రభుత్వ పథకాలపై జిల్లా కలెక్టర్ ప్రసంగించారు. విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అడిషనల్ డీసీపీ లా & ఆర్డర్ 77వ. భారత గణతంత్ర దినోత్సవంపురస్కారించుకొని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ లా & ఆర్డర్ ప్రసాద్ రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు పోలీస్, హోంగార్డు, మినిస్ట్రీయల్ స్టాఫ్ సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ... రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఆకాంక్షిస్తూ.. మన ఈ స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల వెనక ఎంతో మంది పోరాటయోదుల త్యాగం దాగి ఉన్నదని గుర్తు చేస్తూ....మన వంతు భాద్యతగా దేశసేవ కొరకు పాటుపడాలని, సిబ్బంది తమ విధులను భాద్యతాయుతంగా నిర్వహించి పోలీస్ వ్యవస్తకు మంచి పేరు ప్రతిష్ట తీసుకురావడానికి కృషి చేయాలని సిబ్బందికి సూచిస్తూ..ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.
శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ స్కూల్ లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్ పర్సన్ శ్రీమతి నిష్ఠా శర్మ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గారితో కలసి జెండా ఆవిష్కరించారు. ఆనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచారు.
సిఏఆర్ హెడ్ క్వార్టర్స్ సిటీ ఆర్మడ్ రిజర్వ్ హెడ్ క్వార్టర్స్ లో ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, జాతీయ జెండాను ఆవిష్కరించారు.

# సైనిక శక్తి-వందేమాతరం స్ఫూర్తి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వారిని వెంటబెట్టుకుని సంప్రదాయ గుర్రపు బగ్గీలో వేడుకలకు విచ్చేశారు. అనంతరం త్రివిధ దళాధిపతి హోదాలో సైనిక వందనం అందుకున్నారు. ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులు, త్రివిధ దళాధిపతులు, సైనిక, ప్రభుత్వ ఉన్నతాధికారులు వేడుకల్లో పాల్గొన్నారు.
పలు రంగాల ప్రముఖులతో పాటు మొత్తం 10 వేల మందికి పైగా వేడుకలకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో 'సారే జహా సె అచ్ఛా', 'కదం కదం బఢాయె జా'వంటి దేశభక్తి గీతాలతో పాటు వందేమాతరం అందరిలోనూ స్ఫూర్తి నింపాయి. 90 నిమిషాల పాటు జరిగిన వేడుకలో 18 సైనిక దళాలు, 13 సైనిక బ్యాండ్లు అలరించాయి. వేడుక అనంతరం రాష్ట్రపతి ప్రత్యేక అతిథులతో పాటుగా గుర్రపు బగ్గీలోనే వెనుదిరగడం విశేషం.
ఈసారి గణతంత్ర కవాతులో యూరోపియన్ యూనియన్‌కు చెందిన సైనిక దళాలు కూడా పాల్గొనడం విశేషం. ఈయూ సైనిక పతాకతో పాటు ఆపరేషన్ అట్లాంటా, ఆస్పిడెస్ నేవీ ఆపరేషన్ల తాలూకు పతకాలతో అలరించాయి. యూరప్ బయట ఇలాంటి వేడుకల్లో ఈయూ దళాలు పాల్గొనడం ఇదే తొలిసారి!



సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ సిమ్రన్ బాల ఈసారి గణతంత్ర పరేడ్‌లో నారీ శక్తికి ప్రతీకగా నిలిచారు. పూర్తిగా పురుషులతో కూడిన 147 మంది సభ్యుల సీఆర్పీఎఫ్ దళానికి ఆమె సారథ్యం వహించి చరిత్ర సృష్టించారు. 'దేశ్ కే హమ్ రక్షక్'గీతం నేపథ్యంలో వినిపిస్తుండగా ఆమె నాయకత్వంలో సీఆర్పీఎఫ్ దళం కవాతు సాగింది. గణతంత్ర వేడుకల్లో పూర్తిగా పురుషులతో కూడిన సైనిక దళానికి మహిళా ఆఫీసర్ నాయకత్వం వహించడం ఇదే తొలిసారి. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాకు చెందిన 26 ఏళ్ల సిమ్రన్ గతేడాదే సీఆర్‌పీఎఫ్‌లో చేరారు. ఆ జిల్లా నుంచి ఆఫీసర్ హోదాలో అందులో చేరిన తొలి మహిళ కూడా ఆమే కావడం విశేషం. సిమ్రన్ స్వగ్రామం నౌషేరా నియంత్రణ రేఖకు కేవలం 11 కి.మీ. దూరంలోనే ఉంటుంది. ఆమె తాత కూడా సైన్యంలో పని చేశారు. గణతంత్ర వేడుకల్లో ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా ప్రధాని నరేంద్ర మోదీ ఆకర్షణీయమైన తలపాగా అందరినీ ఆకట్టుకుంది. ఈసారి ఆయన బంగారు జరీతో నేసిన నెమలీక ముద్రలతో కూడిన ముదురు ఎరుపు రంగు, పసుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన తలపాగా ధరించారు. ముదురు నీలం, తెలుపు రంగుల కుర్తా పైజామా, తేల నీలం రంగు హాఫ్ జాకెట్ ధరించారు. పదేళ్లకు పైగా పంద్రాగస్టు, గణతంత్ర వేడుకల్లో మోదీ రంగుల తలపాగాలు ధరిస్తూ వస్తుండటం తెలిసిందే. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయన్ కూడా భారత సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిపోయారు. సాధారణ ప్యాంటు, సూటుకు బదులుగా ఆమె ముదురు ఎరుపు, బంగారు రంగులతో కూడిన పట్టు బంద్‌గలా ధరించారు.



ఈసారి గణతంత్ర వేడుకల్లో ఆహూతుల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్లకు ఈసారి వీవీఐపీ, వీఐపీ వంటి పేర్లకు బదులుగా నదుల పేర్లు పెట్టడం విశేషం. బియాస్, బ్రహ్మపుత్ర, చంబల్, చీనాబ్, గండక్, గంగా, ఘగ్రా, గోదావరి, సింధు, జీలం, కావేరి, కోసీ, కృష్ణ, మహానది, నర్మద, పెన్నా, పెరియార్, రావి, సోన్, సట్లెజ్, తీస్థా, వైగై, యమున పేర్లతో ఎన్‌క్లోజర్లను రూపొందించారు. జనవరి 29న రాష్ట్రపతి కార్యాలయంలో జరిగే బీటింగ్ రిట్రీట్ వేడుకకు కూడా ఆహూతుల ఎన్‌క్లోజర్లకు వినూత్నంగా వేణువు, డమరుకం, ఎక్‌తారా, మృదంగం, నగాడా, పఖావజ్, సంతూర్, సారంగి, సరోద్, షెహనాయ్, సితార్, తబలా, వీణ వంటి భారత సంప్రదాయ సంగీత వాయిద్యాల పేర్లు పెట్టనున్నారు.
ఈసారి వేడుకల్లో వందేమాతరం థీమ్ ప్రధానాకర్షణగా నిలిచింది. ఆ గేయంలోని తొలి చరణాలకు అద్దం పట్టే తేజేంద్రకుమార్ మిత్రా వంటి కళాకారుల పురాతన పెయింటింగుల నమూనాలను ఆహూతుల ఎన్‌క్లోజర్లపై ప్రదర్శించారు. జాతీయోద్యమంలో దేశమంతటా స్ఫూర్తి నింపిన ఈ గేయ రచనకు ఈ సంవత్సరమే 150 ఏళ్లు నిండటం తెలిసిందే. ఆ సందర్భంగా '150 ఏళ్ల వందేమాతరం'థీమ్‌కు గణతంత్ర వేడుకల్లో ప్రాధాన్యం దక్కింది. ఆహ్వానపత్రికల నుంచి పరేడ్ల దాకా అన్నింట్లోనూ వందేమాతరం లోగో దర్శనమిచ్చింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in